పారాహుషార్



రాయదుర్గంలోని బైపాస్ పక్కనున్న ఇందిరమ్మ కాలనీలో చోరీ జరిగిన ఇళ్లు



దొంగల చేతిలో ధ్వంసమైన బీరువాలు



- రాయదుర్గంలో వరుస చోరీలు
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు
- ఆందోళనలో ప్రజలు

రాయదుర్గం: నియోజకవర్గంలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా జరుగుతున్న చోరీలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పోలీస్‌స్టేషన్లకు కూతవేటు దూరంలోనూ దొంగతనాలు జరుగుతుండడం గమనార్హం . రాయదుర్గం పట్టణంలో చర్చి ఏరియాలో మూడిళ్లలో జరిగిన దొంగతనాలు మరువక ముందే తాజాగా బైపాస్‌రోడ్డు పక్కనున్న ఇందిరమ్మ కాలనీలోనూ మూడిళ్లలో చోరి జరగడం ఆందోళన కలిగిస్తోంది. కుక్కలు మొరిగినా, రాత్రిళ్లు సంచారం కనిపించినా దొంగలేమోనన్న భయంతో వణికిపోతున్నారు. చోరీలకు అడ్డుకట్ట వేసేలా పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన చోరీల వివరాలు ఇలా..

- అక్టోబర్ 4న అర్ధరాత్రి దాటక రాయదుర్గం పట్టణంలోని బైపాస్ రోడ్డు పక్కనున్న ఇందిరమ్మ కాలనీలోకి దొంగలు చొరబడ్డారు. తాళాలు వేసిన మూడు ఇళ్లలో చోరీలకు తెగపడ్డారు. ప్రైవేటు చిట్ ఫండ్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న జబీవుల్లా ఇంట్లో రూ.50 వేల నగదు, 20 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి అపహరించారు. పక్కన రెండిళ్లలోనూ రూ.50 వేలు నగదు, 50 తులాల వెండి, 10 గ్రాముల బంగారం, విలువైన వస్తువులు దోచుకెళ్లారు.
- సెప్టెంబర్ 29న అర్ధరాత్రి దాటక రాయదుర్గం చర్చి ఏరియాలో మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. గంగానాయక్ ఇంట్లో రూ.50 వేలు, 3 పట్టుచీరలు, కవితాబాయి ఇంట్లో రూ.20 వేలు నగదు, మోహన్ ఇంట్లో రూ.4 వేలు ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 27 రాత్రి పట్టణ శివారులోని కేటీఎస్ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ దుకాణంలో పైకప్పు రేకులు తొలగించి రూ.3 వేలు నగదు, సిగరెట్లు, సరుకులు అపహరించారు.
- అక్టోబర్ 8న బొమ్మనహాళ్ మండలం సింగానహళ్లిలో చిన్న వండ్రప్ప అనే రైతు ఇంట్లో చోరీ జరిగింది. 20 తులాల బంగారాన్ని దోచుకెళ్లారు.
- అక్టోబర్ 9న అర్ధరాత్రి దాటిన తర్వాత పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులో రేకుల షెడ్డును కత్తిరించి నగదు తో పాటు విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో మేలు

పట్టణంలోని వివిధ దుకాణదారులు, అపార్ట్‌మెంట్లు, ఆయా కాలనీల్లోని ప్రధాన వీధుల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగలకు చెక్ పెట్టొచ్చని పోలీసులు చెబుతున్నారు. తలా ఓ చెయ్యి కలిపి కొంచెం ఖర్చు ఎక్కువైనా నైట్ విజన్‌తో కూడిన కెమెరాలు పెట్టుకుంటే మంచిదని చెబుతున్నారు. సీసీ పుటేజీ రికార్డు అవుతుందో లేదో ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, ఇలా చేస్తే దొంగల్లో వణుకు పుట్టి చోరీలు కట్టడి అవుతాయని అంటున్నారు.

ఉమాను కలిసి ఎమ్మెల్సీ మంగమ్మ



ఉమాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మంగమ్మ

కళ్యాణదుర్గం: ఇటీవల వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడిగా నియమితులైన ఉమా మహేశ్వర నాయుడును ఎమ్మెల్సీ మంగమ్మ కలిశారు. శనివారం ఉమా స్వగృహంలో ఆయన్ను కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం స్థానిక రాజకీయాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తలారి సత్తి, మాజీ ఎంపీపీ కొల్లప్ప, మాజీ మండల కన్వీనర్ సర్వోత్తమ తదితరులు ఉన్నారు.

ఎన్‌జీఓ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



ఎన్నికైన ఎన్‌జీఓ సంఘం నూతన కార్యవర్గం

కళ్యాణదుర్గం : స్థానిక ఎన్జీఓ హోంలో ఎన్నికల అధికారి ఏ . ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఏపీఎన్‌జీఓ సంఘం ఎన్నికలు ఏకగ్రీవకంగా జరిగాయి. అధ్యక్షుడిగా ఎస్ తిరుపాలయ్య, సెక్రటరీగా ఎన్ రాజేష్, సహాధ్యక్షుడిగా గంగరాజు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ చరణ్, సుజాత, అచ్చమ్మ, జాయింట్ సెక్రటరీగా ఓబుళమ్మ, అనిల్, నల్లప్ప, కోశాధికారిగా సుభాషిణి, ఉమెన్ సెక్రటరీగా షబీబా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సెక్రటరీ చంద్రమోహన్, కమర్షియల్ ట్యాక్స్ ఎన్జీఓ అసోషియేషన్ అధ్యక్షులు వెంకటేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవుల జాతర



అలంకరణలో ఎల్లమ్మ దేవి

బ్రహ్మసముద్రం : ముప్పలకుంట గ్రామంలో వెలసిన యాదవుల ఆరాధ్యదైవం రేణుక ఎల్లమ్మ దేవి ఆవుల జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఆవుల గూడు వద్ద అమ్మవారిని ప్రతిష్ఠించి గ్రామంలో ఉన్న పాడి పశువులను సైతం అమ్మవారి గూడు చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. భక్తులకు దాతల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నేమకల్లు అంజన్నకు పూజలు



అలంకరణలో నేమకల్లు అంజన్న

బొమ్మనహాళ్: నేమకల్లు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు అనీల్‌కుమార్ చార్యుల ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు.

49 చెరువులను నీటితో నింపాలి



పీఏబీఆర్‌లో నీటిని పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా బృందం

కూడేరు: పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడి కాలువకు నీటిని విడుదల చేసి 49 చెరువులను పూర్తిగా నింపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ నేతలతో కలసి పీఏబీఆర్‌ను సందర్శించి డ్యాంలో నీటి మట్టం , ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యంతో డ్యాంకు ఏర్పడిన లీకేజీలు మరమ్మతులకు నోచుకోలేక నీరంతా వృథాగా బయటకు వెళుతోందన్నారు. భూసేకరణ చేసి రైతులకు పరిహారం చెల్లించి పీఏబీఆర్‌లో 11 టీఎంసీల నీటిని నిల్వ ఉంచలేకపోతున్నారని ధ్వజమెత్తారు. జల విద్యుత్ ఉత్పత్తి పేరిట సుమారు 600 క్యూసెక్కుల నీరు బయటకు వెళుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు రాజారెడ్డి, చిరుతల మల్లికార్జున, కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు కేశవ రెడ్డి,నియోజక వర్గ, మండల నేతలు పెరుగు సంగప్ప, మల్లికార్జున, నాగేంద్ర, రమణ, మలరాయుడు, వెంకటేష్, నారాయణమ్మ ధనరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటేస్తే మోసం గ్యారెంటీ



కురువళ్లిలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

బొమ్మనహాళ్: చంద్రబాబుకు ఓటేస్తే మోసపోవడం గ్యారెంటీ అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు అన్నారు. మండలంలోని కురువళ్లి, చంద్రగిరి, సిద్దరాంపురం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు 143 హామీల్లో ఇచ్చిన సూపర్ సిక్స్‌కే దిక్కులేకుండా పోయిందన్నారు. గ్రామల్లో మహిళలు తమకు నెలకు రూ.1500 ఎప్పుడు ఇస్తారా.. అని ఏడాదిన్నర నుంచి ఎదురు చూస్తున్నారన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఊసేలేదని విమర్శించారు. ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు సృష్టించిన సంపద, తెస్తున్న అప్పులు డబ్బంతా ఎటు వెళ్లిపోతుందని ప్రశ్నించారు. పాలన అంటే మాట తప్పని మడమ తిప్పని నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ ఉపాధ్యక్షులు వెంకటాక్షిపతి రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్‌లు జయరామ్ రెడ్డి, ఆంజనేయులు, ఎంపీటీసీ వెంకటేశులు, నాయకులు పయ్యావుల సత్యన్న, కోటేశ్వరరెడ్డి, ఆనంద్ రెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బసప్ప, ముక్కన్న, జి.ఎం నాయుడు, జగదీశ్వరరెడ్డి, తిరుమలరెడ్డి, హరి, ఉద్దేహాళ్ వన్నూరుస్వామి, రామకృష్ణ, బడిగే వన్నూరుస్వామి, నాగరాజు, అంజి, బసవరాజు, శంకర్, సతీష్‌రెడ్డి, రామ్‌చరణ్, నాగరాజు, రుద్రయ్య, రమేష్, వన్నూరుస్వామి, కాంతరెడ్డి, రామాంజిని, లక్ష్మన్న, వండ్రప్ప, సుంకన్న, లక్ష్మన్న, హనుమంత, బడిగే నారన్న, వడ్డే మహేష్, హరిజన వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



వీరేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కణేకల్లు: కణేకల్లు మాజీ వార్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ కార్యకర్త తాండా వీరేష్ (60) శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, పంచాయితీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమన, బ్రహ్మసముద్రం మాజీ సర్పంచు కురుబ లోకేష్‌గౌడ్, నాయకులు హనుమంతరావు, రవిబాబు తదితరులు వీరేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరేష్ మృతి పార్టీకి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం



విడపనకల్లు: మాట్లాడుతున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వేణుగోపాల్

విడపనకల్లు: మండలంలోని కేజీబీవీలో వైద్య శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వేణుగోపాల్ మాట్లాడారు. బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. అనంతరం బాలికల హక్కులు గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అమృతలత, హెల్త్ అసిస్టెంట్ నూర్ మహమ్మద్, ఎంఎల్‌హెచ్‌పీ శారత, ఏఎన్‌ఎం హేమలత, జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో కోత

- డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కార్డుదారుల డిమాండ్

కణేకల్లు: గెనిగెర గ్రామంలో చౌకధాన్యడిపో డీలర్ రేషన్ పంపిణీలో కోత విధిస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుండి ప్రతి నెలా కేజీ, కేజీన్నర బియ్యం కోత విధిస్తున్న డీలర్ ఈ నెలలో నాలుగు నుంచి ఆరు కేజీల వరకు కోత విధించినట్లు కార్డుదారులు ప్రజలు తెలిపారు. 20 నుంచి 25 కేజీల లబ్దిదారులకు ఐదారు కేజీలు, 15 కేజీల తీసుకొనే వారికి నాలుగు కేజీల వరకు కోత విధిస్తున్నాడని, ప్రశ్నిస్తే తమను ఎక్కడ ఇబ్బందులు పెడతారోనన్న భయంతో ఎన్ని కేజీలు వేస్తే అంతే తెచ్చుకొంటున్నామని వారు వాపోతున్నారు. తక్కువ బియ్యం వేయడం వల్ల తమకు నెలరోజుల పాటు బియ్యం సరిపోవడం లేదని పేద, నిరుపేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కోత విధించిన బియ్యాన్ని నెలకోసారి బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకొంటున్నారని వారు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి డీలర్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలసిన మెట్టు విశ్వ



బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో వైఎస్ జగన్‌తో మెట్టు విశ్వ

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్ జగన్ లండన్ పర్యటకు వెళుతున్న సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ అంశాలపై కాసేపు చర్చించినట్లు విశ్వ వివరించారు. చిన్నపాటి అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న తన తండ్రి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆరోగ్య క్షేమాన్ని అడిగి తెలుసుకున్నారని చెప్పారు.

సీతారాములుకు ప్రత్యేక పూజలు



అలంకరణలో సీతారాములు

కూడేరు: స్థానిక కోదండరామాలయంలో శనివారం సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి దేవతామూర్తులకు అర్చకుడు భాస్కర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పట్టువస్త్రాలు , పుష్పాలతో దేవతామూర్తులను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్గించారు. భక్తులు సీతారాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న నాయకులు

కూడేరు: మండలంలోని ఎంఎంహళ్లికిలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఆ సంఘం నేతలు, వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గడువులోపు లక్ష్యం పూర్తి చేయండి



బోరంపల్లిలో ఈకేవైసీ పనితీరును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీం బాషా

కళ్యాణదుర్గం: ఉపాధి హామీ జాబ్‌కార్డుల ఈ–కేవైసీ ప్రక్రియ లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ సలీంబాషా ఆదేశించారు. బోరంపల్లిలో జరుగుతున్న ఈ–కేవైసీ ప్రక్రియను ఆయన శనివారం తనిఖీ చేశారు. గ్రామంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి.. ఎన్నింటికి ఈ–కేవైసీ పూర్తి చేశారని టెక్నికల్ అసిస్టెంట్ స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజినేయులును అడిగి తెలుసుకున్నారు. సర్వర్ సమస్యగా ఉందని, త్వరలోనే పూర్తి చేస్తామని సిబ్బంది పీడీకి వివరించారు.

కనులవిందుగా పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీని ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: మండలం పరిధిలో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మి నరసింహస్వామి పల్లకీ సేవ శనివారం కనులవిందుగా సాగింది. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజల నిర్వహణ అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవమూర్తులను శోభాయమానంగా వివిధ పుష్పాలతో అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి ఆలయ ప్రాంగణం చుట్టూ డప్పు వాయిద్యాలు, మేలతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు ద్వారకా తిరుమల స్వామి, బాలాజీ స్వామి, ఆలయ సిబ్బంది మారుతి, తదితరులు పాల్గొన్నారు.



పరామర్శ



అక్షయ ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ నాయకుడు నిజవళ్లి బాబు కుమార్తె అక్షయ అనారోగ్యం బారినపడి అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ శెట్టూరు మండల కన్వీనర్ ఎంఎస్ హనుమంతరాయుడు ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీ



చెర్లోపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

శెట్టూరు: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఏర్పడి ఒక శతాబ్దం పూర్తి చేసుకున్న సందర్భంగా సభ్యులు శనివారం చెర్లోపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 'సేవే పరమో ధర్మః' లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు దాసరి వన్నూరుస్వామి, పూజారి తిప్పేస్వామి, బంగారు మల్లారెడ్డి, వీరేంద్ర, ప్రభాకర్, లేపాక్షి, మల్లిస్వామి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నేతలు

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ నాయకుడు పూజారి అజయ్ కుమార్తె శ్రేయకు కృష్ణ చైతన్యతో శుక్రవారం కళ్యాణదుర్గంలోని శ్రీ గోవిందరాజులు పద్మావతి కళ్యాణమండపంలో వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, సీఈసీ సభ్యుడు మాదినేని ఉమామహేశ్వర నాయుడులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

శనీశ్వరస్వామికి విశేష పూజలు



పూజలందుకున్న శనీశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి(ఇన్‌సెట్‌లో) నారాయణప్ప (ఫైల్)

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ శ్రీనివాసులు తండ్రి పార్టీ నాయకుడు నారాయణప్ప(78) శనివారం అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, రాకెట్ల సర్పంచ్ దెయ్యాల నాగరాజు అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం రాకెట్లలోని నారాయణప్ప స్వగృహానికి మృతదేహాన్ని తరలించారు.

సంక్షిప్త సమాచారం

'ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించాలి'

బెళుగుప్ప: నాయీబ్రాహ్మణుల ఆరాధ్య దైవం ధన్వంతరి జయంతిని ఏటా అక్టోబర్ 18న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ ధనుంజయ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ అధికారికంగా ధన్వంతరి జయంతిని నిర్వహించాలని రాష్ట్ర నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అధికారులకు వినతి పత్రాలను అందజేసిందన్నారు. ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించాలని నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘాలు కోరాయి.

ఉపాధ్యాయులకు సన్మానం

కళ్యాణదుర్గం: స్థానిక ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు ట్రస్ట్ చైర్మెన్ బద్దేనాయక్ ఆధ్వర్యంలో సత్కరించారు. శెట్టూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి మండలాల ఎంఈఓలు శ్రీధర్, ఓబుళపతి, తిప్పేస్వామి హాజరై మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ డీఎస్సీలో ప్రతిభ కనబర్చి 14 మంది ఉపాధ్యాయులుగా కొలువు సాధించడం సంతోషంగా ఉందని బద్దేనాయక్ పేర్కొన్నారు.

అర్హులకు పథకం వర్తింపజేయాలి

కుందుర్పి: మండల వ్యాప్తంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకాన్ని అర్హులైన రైతులకు వర్తింపజేయాలని వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి సర్పంచులు బొమ్మయ్య, ఓబన్న, విజయ్, వెంకటేశులు తదితరులు కోరారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో కేవలం అధికార పార్టీ నాయకులు తమకు నచ్చిన వారికి మాత్రమే ఈపథకాన్ని వర్తింప జేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ మద్దతు దారులకు రైతులకు పథకాన్ని దూరం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా పథకాలు అందజేశారని గుర్తు చేశారు.

రూ.6 కోట్లతో రహదారి మరమ్మతు

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ సరిహద్దు చెక్‌పోస్టు నుంచి గోనేహాళ్ సమీపం వరకు రూ.6 కోట్లతో రోడ్డు మరమ్మతులు చేపట్టనున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈఈ రవిశంకర్‌రెడ్డి శనివారం తెలిపారు. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద హెచ్చెల్సీ కాలువపై ఉన్న వంతెనతో పాటు దెబ్బతిన్న రోడ్డు మరమ్మత్తులు చేస్తామన్నారు. నిధులు విడుదలయ్యాయని, టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కణేకల్లు మండలం గెనిగెర వద్ద దెబ్బతిన్న వంతెన, రోడ్డు మరమ్మతుకు ప్రతిపాదన పంపినట్లు డీఈఈ పేర్కొన్నారు.

అనారోగ్యంతో విద్యుత్ డీఈఈ మృతి



వెంకట సుబ్బయ్య(ఫైల్)

కళ్యాణదుర్గం: స్థానిక విద్యుత్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈ వెంకటసుబ్బయ్య (50) అనారోగ్యంతో మృతి చెందారు. రెండో శనివారం కావడంతో ఆయన రెండు రోజుల క్రితం స్వగ్రామం కడపకు వెళ్లారు. అనారోగ్యంతో అక్కడే మృతి చెందినట్లు విద్యుత్ సిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య సుశీలమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. డీఈఈ మృతిపై విద్యుత్‌సిబ్బంది సంతాపం తెలియజేశారు.